

# కథా కౌముది

## నిన్నటి భవితవ్యం

## ఎస్వీ కృష్ణజయంతి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో విశిష్ట బహుమతి పొందిన కథ

"విడిపోదామా..?"

చాలా ప్రాచీనకాలం నుంచీ వినిపిస్తున్న తుది బెదిరింపు ఇది.

యుగయుగాలుగా ఓడిపోతున్న భార్యల సాధుస్వభావంపై ఏకచ్ఛత్రాధిపత్యం సాగిస్తున్న 'మగపటిమ'కి దొరికిన బ్రహ్మాస్త్రం ఆ మాటొక్కటే.

వెంటనే బదులువ్వలేదు నేను. అడిగిన వెంటనే ఒప్పుకోవడం, ఒప్పుకోకపోవడం అన్నది సహేతుకమైన విషయం. అది నిజంగా ఆలోచించి తీసుకునే నిర్ణయంతో సమానం అని నాకు అనుభవపూర్వకంగా ఈ మధ్యనే తెలిసిన సత్యం.

"ఏదోటి చెప్పు... త్వరగా" భయానికి కారణం సిద్ధం చేస్తున్నవాడిలా అడిగాడు.

"ఆలోచించుకోవాలి" కూడబలుక్కున్నట్లుగా చెప్పాను.

"ఎప్పటికీ ఓ కొలిక్కిరాదు నీ ఆలోచన. నాకు తెలుసు. భవిష్యత్‌ని కూడా ముందుగానే ప్లాన్ చేసుకున్న తర్వాతనా?" దెప్పిపొడుపు.

"అందుక్కాదు. ముందు గమ్యం ఏమిటో నిర్ధారించుకోవాలి. దానివల్ల ఇద్దరమూ నష్టపోకూడదు. ఎవరి ప్రయోజనాన్ని వారు వేరు చేసుకోవాలి. సవ్యంగానే విడిపోదాం."

"మనం నష్టపోకూడదని మంచి సలహానే ఇచ్చావ్. అలాంటప్పుడు అంతకంటే దారుణంగా ఉండాలి నిర్ణయమంటే. అంతేగానీ, ఎటు గాలి వీస్తే అటు వెళ్ళేలా ఉండకూడదు. ఎంతయినా ఆడజాతి కదా మరి" అతడి నోటినుంచి అతి సహజమైన విమర్శ.. కాదు, కాదు దెప్పిపొడుపు.

నాకిక అతనితో వాదించాలనిపించలేదు.

నిస్తేజంగా కుర్చీలో కూలబడిపోయి అరచేతుల్ని చూసుకున్నాను. ఇవి చాలా శక్తివంతంగానే ఉన్నాయి. 'వీటితో ఒక గుండ్రని రాయి తీసుకుని దానిమీద నా పేరు రాయాలి. తర్వాత దాన్ని సాధ్యమైనంత వేగంగా దూరంగా విసరాలి ' అనుకున్నాను.

ఇక్కడితో ఆగిపోకూడదు. కలతకు స్వస్తి చెప్పి జాగృతిని కూడగట్టుకోవాలి. వెంటనే జీవితాన్ని తిరగరాసుకోవాలి. ఇప్పుడు నేనున్న స్థితి వేరు. దీనికి భిన్నంగా పోరాడాలి.

సరిగ్గా పదేళ్ళ క్రిందట చుడీదార్ వేసుకుని, జుట్టుకి పోనీటెయిల్ వేసి, పక్కమీద ఏడింటివరకూ వెచ్చగా పడుకుని అమ్మ ఎంత లేపినా లేవకుండా 'నేను' అన్న అస్తిత్వపు ఆత్మాతిశయంతో 'స్వర్గం అనేది ఎక్కడో లేదు ఈ భూమ్మీదే చూస్తాను' అన్నంత గర్వంతో ఉండేదాన్ని.

కానీ ఇప్పుడు 'నాది' అనే సామాజిక వ్యక్తిత్వానికి లోబడి దుఃఖంతో, విషాదంతో, దిగులుతో అన్నిటినీ కలిపి 'వాస్తవం' అనే సంబంధంతో జీవితాన్ని గడుపుతున్నాను.

సాంఘికంగా నాకు భద్రత కావాలి. అందుకు సార్వభౌమాధికారం సంపాదించాలి.

అందుకు కావలసిన క్రమశిక్షణ అలవరచుకోవాలి. క్రమంగా జననానికీ, మరణానికీ మధ్య జరిగే నాటకీయ మార్పుకి 'జీవితం ' అనే సిద్దాంతాన్ని కనుక్కునే దిశగా నన్ను నేను తెలుసుకునే అనుభవానికి రాటుదేలబోతున్నాను.

ఒక స్థిరమైన ఫలితాన్ని సాధించడానికి అపురూప బంధాన్ని త్యజించడానికి సమయం సిద్దమౌతోంది.

వసుమూర్తి పెద్ద అందగాడు కాదు, పేరొందిన ప్రముఖ వ్యక్తీ కాదు. అతనితో నా పెళ్ళి ప్రేమపూర్వకంగా జరగలేదు, పెద్దలు నిర్ణయించిందీ కాదు. ఒక 'అగ్రిమెంట్'తో జరిగింది. పెళ్ళయ్యాక ఇద్దరమూ 'బాధ్యత'గా బ్రతకాలి. ఆ బాధ్యతలో సెంటిమెంట్లుగానీ, విపరీత ప్రేమానురాగాలుకానీ ఉండవు. 'ఎప్పుడైనా ఇద్దరి మధ్యా అభిప్రాయ భేదాలు వస్తే తక్షణం విడిపోదాం' అన్న కాంట్రాక్ట్ పద్దతి మీద జరిగింది.

పెళ్ళయిన తొలిరోజుల్లో తెలియని అసహాయ స్థితి నన్నావరించింది. 'ప్రేమ' అనే అద్భుతమైన ఘర్షణ మొదలైంది నాలో. శారీరకంగా, మాటల వల్ల అతడ్ని మా 'అగ్రిమెంట్' నుంచి తప్పించి 'నా సొంతం' చేసుకోవాలనే తపన ప్రారంభమైంది.

ప్రశాంతమైనది, గంభీరమైనదీ, హుందాతనం ఉన్న ప్రేమలోనే స్వర్గం నిండివుంటుందన్న అతి నమ్మకం నన్ను పరోక్షంగా యుద్ధానికి హేతువుని చేసింది. బాధ్యత పట్ల నన్ను విముఖురాల్ని చేసింది. ఆ బలహీనతే చాలామంది మగవాళ్ళలో బహిర్గతంగానే ప్రదర్శితమౌతూ, మూర్తిలో నిద్రాణమై ఉన్న 'పురుషాహంకార' లక్షణానికి మేల్కొలుపు అయింది.

మా ఇద్దరి మధ్యా ఉండే బంధం కేవలం 'సంబంధం'గా మారుతూ, జీవితంలోని ఓ కార్యకలాపంగా మారి అక్కడ్నుంచి జీవన సంక్షోభానికి దారికాచే ఓ విధ్వంసంగా రూపుదిద్దుకుంటోందని ఋజువు చేసే సంఘటనలు రోజుకొక్కటి చొప్పున జరుగుతున్నాయి.

"నిన్ను నువ్వు తెలుసుకోకుండా నన్ను తెలుసుకోవడానికి ప్రయత్నించకు. నువ్వింకా భ్రమల స్టేజిలోనే ఉన్నావని ముందే రవ్వంతైనా తెలిసుంటే బాగుండేది. ఒక జీవితకాలం నష్టపోయేంత ప్రమాదం జరిగేది కాదు" అంటాడు.

భర్తగా, నాపై అధిపతిగా, నా శరీరానికి అర్పణగా భావిస్తున్న అతనిపై నాలోని అనురాగం, ఆత్మీయతలు గాలిబుడగలైపోసాగాయి.

"నేనున్నానని అనుకోవటం వల్ల మాత్రమే నువ్వు జీవించలేవు సుజాతా! చెయ్యడమెలాగో తెలీదు, ఏం చెయ్యాలో తెలీదు. గుండె, ఊపిరితిత్తులు, కండరాలకి పనిచేసే శక్తి ఉన్నా వాటికి విశ్రాంతి లేకుండా రక్తప్రసరణ జరుగుతున్నా, నువ్వు మాత్రం వాటికి బద్ధకాన్ని నేర్పుతున్నావు. ఏ పనీ చెయ్యకుండా మాంసాస్థికల ముద్దగా నా కళ్ళముందు తిరుగుతున్నావ్. ఇలాంటి నిన్ను నాదానిగా ఎలా చేర్చుకుంటాను? కేవలం ఇంటిపని, వంటపని, పిల్లల పని చేసే పనిమనిషిగా తప్ప బాధ్యతల గురించి ఆలోచించని నువ్వు మనిషివెలా అవుతావ్? అసహ్యంగా ఉంది నువ్వంటే" అన్నాడొకసారి గుండెని చీల్చి చెండాడే విధంగా.

“ఎలా అర్థం చేసుకుంటావు మూర్తి. నువ్వు నా భర్తవి. నువ్వూ నేనూ, మన పిల్లలూ, ఈ కుటుంబం ఒక శాశ్వతమైన గుర్తింపు. ఈ గుర్తింపు కోసమే కదా ఆడది జన్మలు కోరేది? భర్తగా నిన్ను ప్రాణంగా ప్రేమించాలని ఉంది. నువ్వు ప్రేమించలేవా? ప్రేమించేవాడు ప్రత్యేకంగా బాధ్యతలు, కర్తవ్యాల గురించి మాత్రమే మాట్లాడ్తాడా? ఒకటిగా కలిపిన మన బంధం మీద నీకు రవ్వంతైనా మమకారం లేదా?” స్త్రీగా నా వాదనని నేను వివరించాలనే సూత్రం నాది.

అదొక కపట సూత్రమని, బాధ్యతల బరువు నుంచి తప్పించుకోవడానికి దొరకబుచ్చుకున్న సాధనమనీ ఖండించే పురుషాహంకార ధోరణి అతనిది.

ఎలా తెస్తున్నాడో, ఏం చేస్తున్నాడో తెలీదు. ఇద్దరు చేసే పని ఒక్కడు చేస్తున్నాడు. కలిగిన ప్రతి కష్టానికీ ఆయన్నడిగితే తప్ప నాకు భుక్తి లభించడంలేదు. ఈ మాట చెప్పుకోవడానికి నాకు చాలా అసహ్యంగా ఉంది. ఈ అవస్థ నుంచి నాకు విముక్తి కావాలి. అందుకు ఏం చేయాలి?

సమస్యాత్మకమైన నా పరిస్థితి గురించి బాహ్యంగా ఎవరికీ చెప్పుకోను. చెప్పను కూడా. అలా చెప్పడం వల్ల నాకు దొరికేవి రెండు ఓదార్పు మాటలు, నాలుగు సానుభూతి పలుకులు. ఆ రెండూ కోరడానికి, అందుకోవడానికి సిద్ధంగా లేను నేను. అంతకంటే ఆత్మహత్య నయం. ఒకరకంగా చెప్పాలంటే అది సమస్య నుంచి తప్పించుకోడానికి సరైన దారి అవుతుంది.

వసుమూర్తితో గల సంబంధంలో నేనెలా ఉన్నానో సరిగ్గా సమాజంతో కూడా నాకున్న సంబంధం అలాగే మారుతోందని నాకు వెంటనే గుర్తురావడంలేదు .అన్నింటికంటే మొదట ముఖ్యంగా కావలసింది నన్ను నేను సమూలంగా రూపాంతరం చేసుకోవడం.

"నువ్వు బాధ్యత గురించి తెలిసిన సమర్ధురాలివి అయినప్పుడే నిన్ను నిన్నుగా గుర్తిస్తాను. అంతేగానీ బంగారు పట్టుచీర కట్టుకుని, తలనిండా మల్లెపూలు పెట్టుకుని, రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలతో గుడికెళ్ళి ఇంటికొచ్చి ఎదురొస్తే 'నువ్వే అభినవ దేవతవి' అని మెచ్చుకోవడానికి నేను ఉత్తముణ్ణికాదు సుజాతా. నేను ప్రేమికుడిగా నిన్ను స్వీకరించలేదు, అందులోనూ సంపన్నుణ్ణి కాదు. కేవలం 'బాధ్యత' ....బాధ్యత ఒక్కటే ఇద్దర్నీ ఒకింటివాళ్ళని చేసింది. ఇద్దరు బిడ్డల తల్లిగా వారికి ప్రేమనందించవలసినదానివి. ఇంకా పెళ్ళికాని ఆడపిల్లగా ప్రేమ గురించి ప్రాకులాడకు. నీకేదో నీతులు చెప్తున్నాననుకోకు. నాకంటే ఎక్కువ తెలివుంది నీకు"

'మానవ సంబంధాలన్నీ అంతర్గత యుద్ధాలే.. అని తెలపడానికి " ఇంతకన్నా నిదర్శనమేముంది?

"నువ్వూహించుకునే ప్రేమే నాలోవుంటే బంగారప్పెట్టె ఉన్న అమ్మాయినే చేసుకునేవాణ్ణి. కానీ, నీలో బాధ్యత నెరవేర్చే పట్టుదల, సమర్ధతా ఉన్నాయని నిన్ను ఇష్టపడ్తున్నాను. ఆ రెండూ చాలామంది ఆడవారిలో ఉండవు. నువ్వు వారిలో చేరాలని ప్రయత్నించకు. నీ అస్తిత్వాన్ని నిలుపుకుంటూ నువ్వు నువ్వుగా నిన్ను ఋజువు చేసుకుంటే ప్రపంచమే నిన్ను ఆరాధిస్తుంది . ఇంతకంటే నువ్వు సాధించాల్సింది ఇంకేమీ లేదు."

అహం మీద దెబ్బకొట్టే ఆ మాటలు నాలో రోషాన్ని గాక, మానసిక విప్లవాన్ని రేకెత్తిస్తున్నాయి.'ఎంత మగాడివైతే మాత్రం భర్త పదవిలో ఉంటూ భార్యని అలాంటి మాటలతో హింసించడం సభ్యత అనిపించుకుంటుందా?' అని అతన్ని ఘాటుగా విమర్శించలేను. నా బాధ్యత తెలిసికూడా దాన్ని సక్రమంగా నిర్వర్తించకుండా అతనికే వదిలివేశాను కాబట్టి, అతి ముఖ్యమైన అస్తిత్వ స్వాతంత్ర్యాన్ని నిలుపుకునే హక్కుని కూడా కోల్పోయాను నేను.

వాస్తవంలో జరుగుతున్న యుద్ధంలో పోరాడడానికి సంసిద్ధమవ్వాల్సిన నాలో.. మానసిక యుద్ధాన్ని ప్రేరేపించడానికి అతనికి అన్నివైపులా అవకాశమిస్తున్నాను.

ఆడవాళ్ళలో కొందరికి మాత్రమే పరిమితమైన మాధుర్యాన్ని 'వివాహబంధం' ద్వారా ఏర్పాటు చేసి, మిగతా ఆడవాళ్ళందరికీ తద్వారా ప్రసాదించిన జీవితాన్ని మధురమైన సామరస్యంగా మారకుండా రెండు హృదయాలను చిన్నాభిన్నం చేసే 'విచ్ఛిన్నకర ప్రక్రియ'గా తయారుకావడానికి మూలకారణం కూడా 'భర్త' అనబడే యుద్ధమే.

కొన్ని రాత్రిళ్ళు ఇద్దరు పసిబిడ్డల ఆలనాపాలనలో అలిసిపోయి మంచానికి చేరగిలబడినపుడు వెంటనే హృదయంపై దాడి చేసే వ్యతిరేక శక్తులు సిద్దంగా ఉండేవి.

నువ్వు పగలూ, రాత్రిని సమంజసంగా, సమతూకంగా లెక్కించనపుడు సరైన దారి ఎలా అవగతమవుతుంది? ఒక సమస్య వచ్చినపుడు ఇష్టం లేకపోయినా పరిష్కారం కోసం వెంటనే స్పందించే అలవాటు లేని నీకు అదే అలవాటుగా మారిన ఇష్టమైన మత్తు – 'నిద్ర' రూపంలో అంత సులభంగా ఎందుకొస్తుంది?

'మానసిక విప్లవం' లేనిదే ప్రమాదకరమైన పరిస్థితుల్నీ, భద్రత, సౌకర్యం, సంతృప్తినీ విచ్చిన్నం చేసే హింసాత్మక అవస్థనీ ఎలా శక్తిమంతంగా ఎదుర్కోగలవు?

నువ్వు మారడం నీకిష్టం లేనపుడు నీతో భాగస్వామ్యం పంచుకోవడానికి ఒప్పుకున్న వ్యక్తి ఎలా మారతాడు? ఇద్దరూ కలిసినందుకే గదా ఉమ్మడి జీవితం ఒకటి కావాలనుకుంటోంది?

ఇచ్చిన వాగ్దానం నెరవేర్చనపుడు నిశ్చింత కరువవుతుంది.

చేసేవారు ఒకరున్నారని, ఇక నీకేమీ కష్టాల్లేవని హాయిగా ఉండడంలో అర్థం లేదు.

నువ్వు మేల్కోవాలి. ప్రపంచంతో నీకు చాలా పని ఉంది.

నీ దృష్టిలో ప్రేమించడం అపూర్వమైనది అయినపుడు దాన్ని అందుకోవడం అనేది కూడా  అపూర్వమైనదిగానే ఉండాలి. అన్నిటికన్నా ముందు ఆ ప్రేమ కన్నా ముఖ్యమైనది గమ్యం... గమ్యం.

నిర్దిష్టత లేని గమ్యం జీవితాన్ని అల్లకల్లోలం చేస్తుంది. అప్పుడే అసూయ, ద్వేషం, అధికారపూరిత అసహనాలు ప్రారంభమవుతాయి. అలాంటి అవాంఛిత పరిస్థితిని తట్టుకునే సహనం జీవితాంతం వరకు నీలో ఉంటుందా? జన్మజన్మలుగా నువ్వు వెతికే కళ్ళల్లో మెరుపునీ, అందమైన వెలుగునీ దర్శించగలిగే గాఢతను సొంతం చేసుకో.

"నేనున్నంత కాలం నువ్వు మేల్కోలేవు. నిండా నిందారోపణలున్నాయి. వాటిలో నేనొక్కడ్నే మునిగిపోతుంటే హాయిగా చూస్తూ ఉంటావా? మునిగిపోకు రా.. పైకి రా. నీకోసం నేనున్నాను...' అంటూ నువ్వనుకునే ప్రేమపూరితమైన మాటలు నన్ను పైకి ఎలా తేలుస్తాయి? నా చేతినందుకుని 'నేనూ తోడుగా వస్తున్నాను. ఎందుకు మునిగిపోతావ్‌లే' అన్న ధైర్యాన్నిచ్చే చేయి కావాలి గానీ"

అతడి మాటలు సున్నితంగా ఉండవు. మొత్తం అధికార దర్పమే. అన్నిటా శాసించే కరుకుదనమే.

ఆ కఠినత్వమో, అసహజత్వమోగానీ అతనికి దగ్గరగా వెళ్ళాలనికుంటున్న వాంఛని మనసులోంచి పూర్తిగా దూరం చేస్తుంది, ఏదో తెలీని 'పరాయి 'భావం అలుముకుంటుంది. అది నా స్వేచ్ఛనీ, వాక్ స్వాతంత్ర్యాన్నీ హరించివేస్తోంది.

ఇకముందెప్పుడైనా ప్రేమిస్తాడన్న భ్రమలో ఉండేకన్నా తనలో జనించి, నిరంతరం జ్వలించే ద్వేషాగ్నినీ, అసందర్భమైన తత్త్వతాకిడినీ నాపై ప్రదర్శిస్తూ తనను తాను మెలిమెల్లిగా చల్లబరచుకుంటూ ఉంటున్నాడన్న వాస్తవంలో ఉండడమే నయం.

అలా ఎంతకాలానికి చల్లబడటం పూర్తవుతుందో తెలీదు కానీ, దాని తలూకు నిరంకుశాన్ని ప్రతిక్షణం నేననుభవించాలి. అంపశయ్యపై గడపాలి.

పెళ్ళికి ముందు నా భర్త గురించి నేను కన్న కలలు పూర్తిగా విరుద్ధం.

'భర్త' అనే పరిపూర్ణ వ్యక్తిత్వం పూర్తిగా భద్రతనీ, అరవంతు ప్రేమనీ, పావువంతు ఆధారాన్నీ కలిగివుండాలి. వసుమూర్తి ఇందుకు పూర్తిగా విరుద్ధం.

అతడివల్ల నేను వ్యక్తిగతమైన కొన్ని విలువైన అనుభూతుల్నీ, సున్నితమైన స్పందనల్నీ కోల్పోవాల్సి వచ్చింది .'ప్రేమోద్రేకాన్నీ, ఆరాధనా భావాల్నీ, ప్రేమపూరితమైన మురిపాల్ని స్వయంగా, ప్రత్యక్షంగా అతనికి అందించాలి, ఉత్తేజం పొందాలి...' అనే కోరిక రోజురోజుకీ మనసులోంచి ఆవిరైపోతోంది.

చాలాసార్లు ఓ భావోద్వేగం మెరుపులా తట్టి గుండెని పలకరించేది.

'యవ్వనంలోనూ, మనసులో మాధుర్యం నిండిన వేళలోనూ ఒకటి మాత్రం జీవితాంతం వరకు మిగిలి ఉండకూడదు, తీరకుండా ఉండకూడదు. అది హృదయాన్ని సంపూర్ణంగా, స్వచ్ఛంగా కదిలించగల వ్యక్తిపై కలిగిన ప్రేమను ముద్దు ద్వారా గనీ, కౌగిలింతద్వారా గానీ, బాష్పాల ద్వారా గానీ అంతే సంపూర్ణంగా వ్యక్తం చేయాలి. ఒకే ఒక్కసారి.. చివరిసారి '

ఇది తీరకపోతే మృత్యువు దగ్గర ఓడిపోయినట్లే. మరో అర్థంలో అనాథగా కనుమూసినట్లే.

ఇది గుర్తొచ్చినప్పుడల్లా గుండెనిండా శూన్యత ఆవరించుకున్న దిగులు.

అనుక్షణం భావరహితమైన ప్రేమను అనుభవిస్తున్న వేదనలో అర్థం ఉందో, లేదో తెలీని తర్కాలు నిర్లిప్తతను కలగజేస్తున్నాయ్. ఏదో ఒకరోజు తీసుకునే శలవుకి ప్రతిరోజూ శాశ్వతత్వాన్ని పోగుచేస్తున్నట్లుగా ఉంది. నా బ్రతుకు మృతసముద్రమై నా పైనే విరుచుకుపడ్తున్నట్లు బీభత్సభావన.

ఏమూలో పిసరంత ఆశ. వసుమూర్తిలో ఇసుమంతైనా నాపై ప్రేమ కలుగుతుందేమోనని.

జీవితాన్ని ఆస్వాదించే అభిరుచి ఉందిగానీ, అనుభూతులు మిగలడంలేదు. వసుమూర్తి వల్ల జీవితంలో 'రాజీపడడం' అనే రాగానికి సరైన చరణం రాయలేకపోతున్నాననే సమస్య రోజురోజుకీ సూర్యోదయంలా నన్ను ప్రశ్నిస్తూనే ఉంది.

క్షణక్షణానికీ ఎండిపోతున్న హృదయం అనుభవించే స్థాయికి దూరమై 'అనుభూతి' చెందాలన్న ఆసక్తినీ, ఆశనీ నిర్జీవం చేస్తుంటే .. 'భవిష్యత్‌లో నావల్ల కలిగే లాభమేమిటా..?' అనే ఆలోచనలో పడిన నాకు అప్రయత్నంగా గుర్తొచ్చింది వసుమూర్తి కన్నా వాస్తవమైనదేమిటో?

అది అవరోధించడానికీ, ఖండించడానికిగానీ వీల్లేనిదనీనూ.

నాలో దాగిన పరివర్తనకి మూలమైనదీ, వివేకానికి ప్రారంభమైనది కూడానూ.

అన్నింటికంటే ముఖ్యం... మొదట గుండె ఏడవడం ఆగిపోవాలి.

"ఎందుకైనా మంచిది. మనం రేపే విడిపోదాం"

ఖచ్చితంగా వినిపించిన నా కంఠస్వరానికి ఆశ్చర్యంగా చూసిన వసుమూర్తి చూపు ఏదో అంచుని తాకిన జ్ఞాపకంగా కదిలించగలిగిందొక్క క్షణం.

"గుడ్. మంచి మార్పే" అన్నాడు సంతోషాన్ని కొనితెచ్చుకుంటూ.

"ఎవరికి ఉండాల్సిన జ్ఞానం వారికి అందుబాటులో ఉపయోగపడడం లేదంటే అందుకు కారణం ప్రక్కనున్న వారిదేనంటాను. అందుకే మిగిలిన జీవితాన్ని వృథా చేసుకోవడం ఎందుకు? నిజమా, కాదా?" అడిగాను. మనసుని అదుపులో పెట్టుకుంటూ.

"ఆమాట నేన్నీకు మొదట్నుంచీ చెప్తూనే ఉన్నాను సుజాతా. నీలో ఇపుడు కలిపిన ఈ ఆవేశాన్ని తగ్గించుకోవద్దు. చివరిసారిగా మంచి రొమాన్స్ చేసుకుందామా?"

సహజమైన శాడిజానికి ప్రతీకగా కనిపిస్తున్న అతన్ని ఎలా భావించాలో నాకర్థం కావడంలేదు.

"అన్నట్టూ ఎందుకు విడిపోదామనిపించింది నీకు?" మళ్ళీ అడిగాడు.

"నా పిల్లల కోసం. 'ప్రపంచంలో ఎనభైయ్యేళ్ళు బ్రతకడం గొప్పకాదు. అన్ని ఏళ్ళు బ్రతికి ఏమీ సాధించలేకపోవటం ఘోరమైన ఓటమి' అన్న సిద్దాంతాన్ని చాలామంది చెప్పారు. నిజమే. నీతో పావు వంతు జీవితాన్ని ఏ ఉపయోగం లేని విధంగా వెచ్చించి నష్టపోయాను. ఇక ఇంతటితో చాలు. మిగిలిన భాగాన్ని నా పిల్లల్ని చక్కగా పెంచుకోవడానికి ఉపయోగించుకుంటాను. నీ దగ్గరుంటే వారిని సవ్యంగా పెంచలేను సరికదా సరిగా ప్రేమించలేను కూడా. అనవసరంగా మానసికంగా కృంగిపోవడం తప్ప నీనుంచి నాకు దక్కింది ఏమీలేదు. చిన్న మాటలోనైనా కొండంత ప్రేమని అందించగల వ్యక్తికోసం కన్న కలలు, వాస్తవానికి అతకవు అని నువ్వు చెప్పినందుకు... చాలా థాంక్స్" నా గొంతు వణకడం అతనికి తెలీదని నాకు తెలుసు.

"మంచిది..మంచిది. త్వరలో మంచి తల్లివి అవుతావనే నమ్మకం నీకుండాలిగానీ, నాకవసరం లేదు. నేను చెప్పాల్సింది ఏమీలేదని మాత్రం చెప్పగలను" నానుంచి ఇంకేమీ వినడానికి కూడా ఇష్టంలేదన్న అర్థాన్ని పరోక్షంగా తెలియజేసినట్లుంది అతని ధోరణి.

"జీవితమంటే రాత్రికి ముగిసి మర్నాటికి మళ్ళీ కొత్తగా మొదలయ్యే మార్పులాంటిది సుజాతగారూ. ఈ మార్పుని ఉత్సాహంగా అందుకోవడంలోనే బయపడుతుంది. జీవితం పై వారికున్న ఆశగానీ, ప్రేమగానీ"

"వీడ్కోలు ముందు బహువచనం ఆతిథ్యంలాంటిది ' అని అతడన్న మాట గుర్తొచ్చింది.

"ఆ రెండూ కలగాలంటే కొత్త ఊపిరి ఎంతో అవసరమని నా ఉద్దేశం. మనిద్దరి భావాలూ, వైఖరులూ వాస్తవంలో కలవలేదని ఋజువైంది మూర్తిగారూ. మన అగ్రిమెంట్‌లో నేను బాధ్యతాయుతమైన జీవితాన్ని కొనసాగిస్తాననే మాటిచ్చాను. పెళ్ళయ్యాక మొదలైన జీవితం ఓ వింత యుద్ధంలా నన్ను చిన్నాభిన్నం చేసింది. నాకంటూ నిర్మించుకున్న స్వేచ్ఛాజీవితం మీ చుట్టూ బంధించుకుపోయినట్లుగా అనిపిస్తోంది. దానిపై మీ నిర్ణయాధికారాలు, శాసించడాలు, అవమానించడంలాంటివి ఉచ్చుని బిగించినట్లుగా ఉండి ఆడదానిగా నా మనసు స్పందించగలిగే సున్నిత ధోరణి మీనుంచి అందకపోవడం వల్ల ఈ జీవితం నాది కాదనీ, నేను చెయ్యాల్సినవి చాలా ఉన్నాయి గానీ అవి ఈ జీవితంలో చేయడానికి వీల్లేనట్లుగా ఉంది. అందుకే ఈ జీవితం నాకు వద్దనిపిస్తోంది. ఇంతటి ప్రమాదం వల్ల నష్టం కలిగేది నా ఒక్కదానికే కాదు. మీకూ, నాకూ ముఖ్యంగా మన ఇద్దరి పిల్లల జీవితాలకీనూ.

నాకిప్పుడు నా బిడ్డలు ముఖ్యం. వారి భవిష్యత్‌ని వారి కనుగుణంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాను. దీనికి వేరుపడడమే సరైన మార్గమనిపిస్తోంది నాకు.

నా బిడ్డలు ప్రశాంత వాతావరణంలో పెరగాలి. ప్రపంచానికి దూరం, భారం కాకుండా వారికి వారే అద్భుత సామరస్యం సృష్టించుకోవాలన్న ఆశయంతోనైనా నేను ఒంటరిని కావాలనుకుంటున్నాను. నాలో పేరుకుపోయే ఆశలు, ఆశయాలు, సేవ దృక్పథాలులాంటివన్నీ మీతో ఉంటే అవి నా సోమరితనాన్ని పెంచడం తప్ప ఆచరణలోకి పనికిరావనుకుంటున్నాను. ఏదిఏమైనా నేను నా జీవితంలో ఓడిపోయాను. అదీ.. నా సొంతం, నా స్వర్గం, నా ప్రాణం కావాలని ఊహించుకున్న నా భర్త అనే పాత్ర దగ్గర.

తొలిసారి..ఒక్కసారి...చివరిసారి.. ఇంకా తొంభై తొమ్మిదిసార్లు గెలవడానికి ప్రయత్నిస్తాను. నా బిడ్డల్ని శిక్షతోనైనా, శిక్షణతోనైనా సమర్ధవంతంగా, ఉపయుక్తంగా, పాజిటివ్ దృక్పథంలో పెంచేందుకు ఈ అవకాశం వల్ల నేనేమిటో నాకు తెలిసే వీలు కలగవచ్చు.

భావాల్లో వైరుధ్యమో, అవగాహనలో లోపమో, అభిప్రాయాల్లో భేదాలో కారణం ఏదైనా కానీ మనిద్దరి జీవితాలు ప్రేమతో ముడిపడిలేవు. అంతర్గతంగా మీలో ఎంత గాఢమైన ప్రేమ ఉందో, లేదో నాకు తెలీదు. నా మూలంగా దాన్ని రూపుమాపుకోవడం ఎందుకు? అందుకు అదృష్టవంతురాలైన అమ్మాయిని ఆహ్వానించండి. అడ్డు చెప్పడానికే కాదు, అసలు అడ్డుగా నేనుండనని మాటిస్తున్నాను. అసందర్భంగా విడిపోవాలనుకునే మీ నిర్ణయాన్ని విమర్శించే హక్కుగానీ, చనువుగానీ నాకు లేవు. నేను మీనుంచి బలవంతంగా, అయిష్టంగా, జాలిపూర్వకంగా విడిపోవాలనుకోవడం లేదు. నా ఇష్టపూర్వకంగానే, నా బిడ్డల శ్రేయస్సు కోసమే వెళ్ళిపోతున్నాను. ఆపై మీకూ, నాకూ ఏ సంబంధమూ లేదు. ఉండదు కూడా"

నా తరపున చెప్పుకున్న వివరణ అతనిలో ఎలాంటి భావాల్ని రేకెత్తించిందో తెలీదు.

అతనేమీ మాట్లాడలేదు.

COMMENTS